# పరదేశి పెండ్లి

శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యం

కొంచెం లోజ్జు కనిపిస్తే చాలు! వేలుపెట్టి చూపించి వెక్కిరించడం మామూలు ఈ వెధవలోకానికి. అందులో శారీరకంగా అయితే ఆవ్యక్తిబాధ భగవంతుడి కెరుక.

ఆ నాలుగడుగుల రెండంగుళాల శరీరం, చిన్న బొజ్జా, నక్కదోసకాయలాంటి ఆ పొడుగుపాటి తలా — యెవరికి నవ్వు తెప్పించవూ? అయితేనేం? పచ్చటి పసిమివర్ణంలో కుదిమట్టంగా అప్పుడే కోసిన గుమ్మడిపండులా వుంటాడు. కాదుకాదు! లేతసార కాయతో పోలిస్తే బాగుంటుంది. ఎంచేతంటే అంగుళానికి కొన్ని డజన్లచొప్పున అదోవిధమైన రాగివర్ణపు వెంట్రుకలు అతగాడి శరీర మంతా కప్పేశాయి. "ఉన్నసొగసుల కిదిగూడ నొక్కసొగసా?" అని పిల్లికళ్లూ, నత్తీనూ! ఏమిసృష్టి!

పరదేశి పుట్టుపూర్వోత్తరా లెవ్వరికీ తెలియవు. ఆరేళ్ల కుర్రాడైవుండగా అతన్ని రామేశ్వరంనుంచి తీసుకొచ్చాడు నరసింహదీక్షితులు. "ఏతల్లి కన్నదో అమ్మా! అక్కడ మండపందగ్గ ఏడుస్తున్నాడు. వారి కేంబుద్ధి పుట్టించాడో ఆయేడుకొండలవాడు! నాతోవస్తావా? అన్నారు. అప్పటినుంచీ వాడు మమ్మలను వదలలేదు." అని చెబుతోంటుంది వెంకాయమ్మగారు ఇప్పటికిన్నీ ఇరుగు పొరుగు అమ్మలక్కలతో. పాలఘాటులో పిల్లలను అమ్మే ఆచారం వుంది. పిల్లాపాపాలేని దీక్షితులు ఈ అరవవెధవని కొనుక్కొచ్చుంటాడు" అన్నారు కొందరు పండితబ్రువులు.

ఎలా అయితేనేం? అత నీ పదిపందొమ్మిదివత్సరాలూ దీక్షితులగారియింట్లోనే పెరిగాడు. అతన్ని తీసుకొచ్చిన రెండుసంవత్సరాలకే గర్భిణీ అయి సలక్షణంగా వొక మగపిల్లాడిని కనటంవల్లో మరెంచేతో గాని ఆదంపతు లిద్దరికీ అత నంటే ప్రాణం. "మా పెద్దాడు" అని చెబుతోంటారు ఇంటికి యెవరు వచ్చినా.

పరదేశి కిప్పుడు పాతికేళ్లు. కాని ఇంకా వివాహం కాలేదు.

ఆరోజు వాళ్లతమ్ముడు శివరామానికి శోభనం శివరామం ఎఫ్. ఏ. పరీక్ష ఇచ్చాడు. అతని బావమరది రామానందంవట్టి చిలిపివాడు. మహా కొంటె సుమండీ! ఎవరినో వొకరి నేడిపించందే అతనికి ప్రొద్దుపోదు. ఈ శోభనంలో అతని అల్లరనే ఆగ్నేయాస్త్రానికి పాపం! అమాయకపుపరదేశి మాడిపోతున్నాడు.

భోజనా లయినాక అందరూ తాంబూలచర్వణంలో పడ్డారు. కుర్రకా రంతా పందిట్లో వోమూల చేరారు. రామానందం మెల్లిగా వున్నట్లుండి పరదేశిని

"బావా! నీపెళ్లెప్పు?" డన్నాడు.

ఏమని జవాబివ్వాలో పరదేశికి తెలియలేదు. అతని కాగొడవే లేందే! పెళ్లి? అంటే? అనుకున్నాడు మనసులో. "పాపం వాడి కేమీ తెలీదురా. వట్టి అమాయకుడు." అన్నాడు వో పెద్దమనిషి.

పరదేశికి వుక్కురోషం వచ్చి వొక్క విదిలింపుతో అక్కణ్ణుంచి లేచిపోయి పందిట్లో ఇంకో మూల అంగవస్త్రం పరిచి పడుకున్నాడు. కాని అతనికి అదే మథన-పెళ్లిఅంటే ఏమిటి? అన్నసమస్య అతనికి విడదీయరాని దైపోయింది. పందిట్లో పిల్లలు బొమ్మలపెళ్లి చేస్తున్నారు. వాళ్లకేసి చాలాసేపు ఆలోచిస్తూ చూచాడు. కాని యేమీ తట్టలేదు. మెల్లిగా లేచి గాడిపొయ్యిదగ్గఱ వంటచేస్తున్న గోపయ్యదగ్గఱ చతికిలబడ్డాడు. అతన్ని అడుగుదామ

అనిపించింది. ఏమనుకుంటాడో? అయినా అడిగితే తప్పేముంది? సరే. అయితే ఏమని? ఏమనడగాలి? ఏమనడగాలి? అన్న ఆలోచనతో కొన్ని గడియలు గడిచినై.

"ఊరికే దిగాలుపడి చూడక పోతే, కాస్త ఆ పనస కాయకొట్టరాదుటండీ అబ్బాయిగారూ?" అన్నాడు గోపన్న, పులుసులో బెల్లపుగడ్డలు వేస్తూ.

"ఆ...అలాగే?" అని పరదేశి పనసపొట్టు కొట్టేపనికి వుపక్రమించాడు. కాని బుర్రమట్టుకు అక్కడ లేదు. పనసపొట్టు శెనగబద్దలూ, పంపరప నాసతోనలుగా పడుతోంది చేటలో.

"ఏమయ్యోయ్. నీవు కొట్టకుంటే మ- నిగాని చెక్కలు తరిగేపనిమట్టుకు నానెత్తిసి పెట్టకు" అన్నాడు గోపయ్య.

కాని అతని కామాటలు వినిపించలేదు. అత నీ ప్రపంచంలో లేడు. కూరకలియబెడుతున్న గోపయ్య వోక్షణం నిదానించి చూచి బిగ్గఅగా "ఏమయ్యోయ్! నిన్నే! నే నన్నది, వినిపించలేదూ?" అని అరిచాడు.

"ఆ...ఏమంటావ్?" అన్నాడు పరదేశి పరధ్యానంగా వంచినతల ఎత్తకుండా. ఎత్తినకత్తి వేలిమీద పడింది. "బాగుందయ్యా! నీ ఆకారానికి, నత్తికితోడు చెవుడుగూడా దాపరించిందా యేమిటి? ఖర్మం. పరదేశయ్యా! అయితే నామాటలు నీకు విని పించడంలేదూ?" అని చెవులో నోరుపెట్టి అరిచాడు తడిగుడ్డపేలికతో పరదేశి వేలుకు కట్టుకట్టుతూ. పైగా "ఆపెళ్లాం ఎవరో—నీతో ఎలా వేగుతుందో నాకు తోచకుండా వుంది" అన్నాడు. పెళ్లాం మాటెత్తంగానే గతుక్కుమన్నాడు పరదేశి. అప్రయత్నంగా "గో...గో...గోపయ్యమామా! దా...దానికేంగాని, నే నే నే...నేదోమాటడుగుతా గాని జ...జవాబు చెబుతా...తావూ?

"ఏమి టది?"

"నా...నాకు భ... భయంగా వుంది. మ... మ...మరిల్లా అన్నానని యె...యెవరితోనూ చెప్పవు గద" అన్నాడు బెదురుగా.

"అల్లాగే. కానీ?"

"పెపె...పెళ్లంటే యేమిటిమా...మయ్యా?" అన్నాడు ఎంతో వుద్రేకంగా మొహమంతా ఎర్రపడి పోయేటట్టు.

గోపయ్యకు నవ్వూరాలేదు, ఆశ్చర్యమూ కలగ లేదు. విస్తుబోయ్యాడు. ఆ అమాయకుణ్ణి చూసి అతను జాలిపొందాడు. ఒక్క పొడుంపట్టు వేసి "బాబూ, ఒక ఆడదీ, మగాడూ కలిసి వొక ఇంట్లో కాపరం చేయాలని శాస్త్రం. ఈ కలియకనే మంత్రాలద్వారా జరిగిస్తారు. ఈ తంతుకే పెళ్లి అని పేరు" అన్నాడు. పరదేశికి సంతృప్తి కలగలేదు.

ఊహూ! దీని అంతు కనుక్కోవాలి!

"అబ్బ! అ...అదంతా తె...తె... తెలుసులే. ఈ యీ...క...కలియిక యెల్లాటిదీ? అ...అని నా ప్ర—ర...శ్న." అన్నాడు ఆయాసంతో.

చచ్చామురా భగవంతుడా! అనుకున్నాడు.

"ఇదిగో బాబూ నీవింకా కుర్రాడివి. నీవు కొంచెం పెద్దవాడివయి పెళ్లయినాక యీ సంగతులన్నీ తెలుస్తాయి." అని తప్పించుకోబోయ్యాడు. కాని పర దేశి వొదల్లేదు. కామారపు జీడిలా పట్టుకున్నాడు.

"అయితే మా... మా శివరాముడు నా... నా కంటె అ.— అ... అయిదాళేళ్లు చిన్న వా... వాడి కప్పుడే పె—పె...ళ్లయినా...నాకు కాలేదేం?" అని ప్రశ్నించాడు. గోపయ్యకు చిరాకు వేసింది. కరుకుగా "ఆసంగతి నాకేం తెలుసు? మీ నాన్నని వెళ్లడుగు. నాకు పనుందిగాని వూరికే కుంటిగుడ్డిప్రశ్నలతో వేధించకు" అన్నాడు.

ఇహ వీడు మాట్లాడడురా అని తెలుసుకుని పర దేశి కాసేపు ఆలోచనలో పడ్డాడు అలాగే గోడకు చేరగిలబడి. ఈ పెళ్లికి వొక స్త్రీ అత్యవుసరం. ఇప్పుడు తను వొక స్త్రీని సంపాదించడం ప్రథమ కర్తవ్యం. ఈ నిశ్చయంతో అక్కడినుంచి బయట కొచ్చాడు పరదేశి.

పందిట్లో పిల్ల లాడుకుంటున్నారు. పరదేశిని చూసి వొకడు, "వడిగా యెవ్వరివాడవు? అన్నాడు.

మరోడు "ఎవ్వడవు?" అన్నాడు తర్జని మీటుతూ. ఓమూడోకొంటె "సంవాసస్థలంబెద్ది?" అన్నాడు కీచుగొంతుతో బుర్ర గిరగిరా తిప్పుతూ.

"వె—వెధవముండలు" అని వాళ్లని దబదబా నాలుగు బాదాడు పరదేశి.

పందిట్లో చదువుతున్న కమల "వొదిలిందిరోగం! మరీ అంత ఆగడమా?" అంది.

"కుంటిముండ! వా డంటే దీనికెందుకో ఇంత అపేక్ష" అన్నాడు వీపుమంట జెడుతున్న వుక్కు కోపంతో వోసుంట వెధవ.

"అది...వాలి...పెల్లం" అన్నాడు నోట్లో వేసుకున్న వేలు తీయకుండానే ఐదేండ్ల బడితె వెధ వొక్కక్కడు.

పరదేశి గొంతులో పచ్చివెలక్కాయి పడ్డట్లయింది ఈ ఆఖరి వెధవకొంటెమాటకు. నిజంగా! కమలం తనతో కలిసుంటే బాగుండు. కుంటిదయితే యేం? తను మొయ్యలేడూ? అత నదే ధ్యానంతో కమలం కేసి చూస్తూ నిలబడ్డాడు.

చదువుతున్న పుస్తకంమీదినుంచి కళ్లు రెండు మూడుసారులు అలాపైకెత్తిచూచి మళ్లీ తనధోరణిలో పడింది కమలం. ఆబంగారంలాంటిపిల్లను కుంటిదాన్ని చేశాడు భగవంతుడు. ఆ అమ్మాయి రామానందానికి వోవేలువిడిచిన తోడబుట్టుపడుచు. ఆంధ్రాంగ్లాల్లో మంచి ప్రవేశం వుంది. ఆ పెద్దకళ్లూ, బంగారంలాంటి ఛాయా, నువ్వుపువ్వులాంటి ముక్కూ యెవరి నాకర్షించవూ? పన్నెండేండ్లయినా యింకా వివాహంకాలేదు. కాని పాపం పరదేశికీ అందచందాలగొడవ తెలియదు సుమండీ! అతణ్ణి ఆకర్షించింది ఆమె మంచితనమే! పాపం అతన్నామె యెప్పుడూ యేమీ నదు. పైగా యెవరైనా యేదన్నా అంటే వాళ్లని కోపగించుకొనేది.

"కమలం...నీ...నీ...నీవు...నాతో,క...కలిసుంటావా" అన్నాడు యెంతో దృఢంగా.

ఆ అమ్మాయి కర్థంకాలేదు.

"ఏమిటి నువ్వన్నది బావా?" అన్నది ఆశ్చర్యంతో.

"నే...నే...నేనడిగానూ? నీ...నీవు నా...పె...పె... పెళ్లా నివిగా వుం...టా...టావా?" అ...ని అన్నాడు నయాగరా జలపాతపువేగంతో గుక్క తిప్పుకోకుండా.

కమలం నవ్వాపుకో లేకపోయింది. ఆ తెల్లటి బుగ్గలు కందిపోయేట్టు నవ్వింది.

"ఛీ. అల్లాటిమాట" లడగ్గూడదు ఆడపిల్లలను" అంది.

"ఏ...యేం...? అన్నాడు పరదేశి దేబె మొహంతో.

"ఛీ. పో...అమ్మా" అని అరిచింది.

పరదేశి అదే దవుడు తీశాడక్కడనుంచి. ఏం తప్పా? అడిగితే? వాళ్లమ్మతో చెబితే? నాన్నకు తెలుస్తే? ఏం తెలిస్తే? కేకలేస్తాడేమో? తనేం తప్పు చేశాననీ? తను పెద్దవాడుగదా శివరామంకంటే? తనకు మాత్రం వో స్త్రీ కావొద్దూ కలిసివుండడానికి? ఎందుకంటారేమో??... అది అతనికే తెలియదు. ఎవరో వో స్త్రీ తనతో వుండాలి. ఎల్లాగో అంటే తెలియదు? అది పెళ్లయినాకగాని తెలియదన్నాడుగా గోపయ్య! పెళ్లంటే వొక స్త్రీతో కలిసి వుండడమే గాదూ? కాబట్టి...ఏమి తర్కం!

ఈ ఆలోచనతో అతను వో రెండుమూడుమైళ్లు నడిచాడు పొలం గట్టున. జారి బురదలో పడ్డాడు. చెరువులో స్నానంచేసి తడిబట్టలు పిడిచి కట్టుకుని మళ్లా ఇంటిదోవ పట్టాడు. దారిలో అతనికో ఆలోచన తట్టింది. నిన్న తను కట్టెలు కొడుతూండగా సుబ్బాయమ్మ పక్కింటి కోమటి బసవమ్మకోడలితో మాట్లాడుతోంది. "ఈ చదువుకున్న సంస్కారులున్నారే. వీరికైనా అందచందాలూ, చదువులూ కావాలి. అంతేగాని వో అనాథ వితంతువుమీద జాలిచేత వీరేమీ త్యాగం చేయరు. ఓ ఆయన డాక్టరీ చెప్పించమన్నాడు. మరోడు నాకు చదువు లేదని మూతి విరిచాడు. ఇంతకూ నారాత!" అంటం తను విన్నాడు. సుబ్బాయమ్మ నడిగితే? అడిగెయ్యాలి. ఆలస్యమమృతం విషం. అతను వాయువేగ మనోవేగాలతో నడుస్తున్నాడు.

ఇంట్లో నాలుగుమూలలా వెతికాడు. సుబ్బాయమ్మ కనుపించలా. దొడ్లో ఆరోజు శని వారం కావడంవల్ల రొట్టెలు పోస్తోంది సుబ్బాయమ్మ. పరదేశి అక్కడికెళ్లి అదే పోజులో నిలబడి ఫెళ్లున అడిగేశాడు. ప్రక్కనున్న ఆ బాలవితంతువు తల్లి, "ఓరి నీకిదేం పోయేకాలం వచ్చిందిరా! నీ బుద్ధి బుగ్గగానూ అసలుసంధ్యవేళ యెంత అప్రాచ్యపుకూత నిండినింట్లో" అని విరుచుకుపడింది. సుబ్బాయమ్మగోడకి చేరగిలబడి విరగబడిపోయింది పొట్టచెక్కలయ్యేటట్టు—మాడినరొట్టె తిరగెయ్యకుండానే.

పాపం ఆరాత్రి పరదేశి చాలాసేపు పరితపించాడు. తనతో కలిసివుండడానికి ఏ ఆడదీ యిష్టపడదేం? వీళ్ల కిదేం రోగం? పెళ్లిమాటెత్తితే ఇలా దులుపుకుంటారు? ఆ అంగవస్త్రం చాపా అయినా (యెంతో చల్లగా వుండవలసినవి) యెంతో వేడి అనిపించిం దతనికి. సావిట్లోవున్న గడియారపు 'టిక్-టిక్' తనకుండేకాయ "టక్-టక్" గాఢనిద్రలో వున్న ఇద్దరుముగ్గురు స్థూలకాయుల గుర్రుమనే శబ్దం తప్ప ఇంక యేమీ వినిపించలేదు. అతనికా పందిరిలో. లేచి కూర్చున్నాడు గోడకు చేరగిలబడి. అతనికి చెడ్డభయం వేసింది. ఎవరైనా దొంగాడొస్తే? వొళ్లు ముచ్చెమటలుపోసింది. అతని మనోవ్యాధికి మందులేదు. అలాగే కూర్చున్నాడు వినాయకుడిలాగు. తొలిజాముకోడి కూయటంగూడా వినిపించలేదు అతనికి. అప్పుడే కాఫీపొయ్యి అంటించడానికి వచ్చిన గోపయ్యకు కనిపించాడు పరదేశి.

"పరదేశయ్యా! నిద్ర పోలేదేమిటి కళ్లు యెర్రగా వత్తుల్లా అయిపోయాయి. ఏమిటా ఆలోచన? ఏమయ్యోయ్! నిన్నే" అని అరిచాడు.

పరదేశి జవాబు చెప్పలేదు. గబుక్కున లేచి గోపయ్యదగ్గరికి కొచ్చి నిలబడ్డాడు. ఆవిసురు చూసి కొడతాడేమో ననుకున్నాడు గోపయ్య. కాళ్లు యెడంగా పెట్టి చేతులు రెండూ పృష్ఠభాగంలో నడుముమీద ఆనించి అదో నెపోలియన్‌లాగు నిలబడ్డాడు పరదేశి. ఎంతో విసుగుతో, సగం ఏడుపూ సగం నిరుత్సాహం, కొంచెం కోపం ఇత్యాది గుణాల్తో మిళితమైన స్వరంలో అన్నాడు.

"మా...మా...మయ్యా. ఎల్లా నిద్రపోవడం ? నా...నాతో యే ఆ...ఆడదీ కలిసి వు...వుండడానికి యి ... యిష్టపడ్డంలేదు" అ నిన్నటి విశేషాలన్నీ గోపయ్యకి చెప్పాడు. గోపయ్య యేమీ మాట్లాడలేదు తన కాఫీపని చూసుకొంటూ ఊకొట్టటం తప్పితే. పరదేశి "అ...అయితే నీవు అ...అత్తను యెలా పె...పెళ్లి చేసుకున్నావ్" అన్నాడు.

గోపయ్యకు నవ్వొచ్చింది. ఇంకోడయితే ఆవేడి గరిటితో వోటిచరిచేవాడే వీపుమీద. అయినా ఇంకో వెర్రికట్టె ఎవ డడుగుతాడూ ఆప్రశ్న? పరదేశయ్య తప్పితే! తనయౌవనగాథ జ్ఞాపకంవచ్చి పొంగిపోయాడు యాభైయేళ్ల గోపయ్య.

"అది వోచిన్న విచిత్రపుకథ. నేను చదువూ సంధ్యా లేకుండా వూళ్లో తిరుగుతున్నానని మానాన్న నన్నురోజూ "శంఖంతాం" చేస్తూవుండేవాడు. ఒకనాడు పౌరుషం పుట్టి నేను ఇంట్లోనుంచి లేచి పోయాను. ఒకవారంరోజుల్లో చిరివాడలో మీఅత్తయ్యనుచూసి మామామగారితోకూడా మానాన్నదగ్గఱకొచ్చాను. అలా జరిగింది నావివాహం" అన్నాడు.

"అయితే—మ...మరి నీవు అత్తన...డిగితే ఏ—యేమంది?" అన్నాడు.

"ఆ...అదే మంటుందీ. అయినా దాన్ని అడిగిందెవరూ? వాళ్లనాన్న నడిగాను. మనదేశంలో తలిదండ్రులు పెళ్లిళ్లు చేస్తారు. అంతా వారిదే బాధ్యత. అందులో ఆడపిల్లకి అసలేమీ అధికారంలేదు" "పతియే గతి పడతులకును" అంటూ వోచిన్న ఆశువు చెప్పుకుంటూ గోపయ్య, పాలు పొయ్యిమీద పెట్టాడు. అతనికి కొంచెం కవిత్వధోరణి వుందిలెండి.

"అ...అయితే...క...కమలం సంగతి లి...లింగయ్య బాబుగార్ని అ...డుగుతా." అన్నాడు పరదేశి. గోపయ్య ఏమీ మాట్లాడలేదు. మనసులో "నీశ్రాద్ధం" అనుకుని తనవంటపనిలో పడ్డాడు.

పరదేశి కార్యశూరుడు. భోజనాలయినాక పందిట్లో జంధ్యాలు వడుకుతున్న లింగయ్యగారిని వంటరిగా, చూసి నెమ్మదిగా

"బా...బా...బూ మిమ్మల్ని...వొ...వో మాటడగాలి."

"ఏమిటి నాయనా?" అన్నాడు లింగయ్యగారు

"మీ...మీ...కమలాన్ని నా...నాకు పె...పెండ్లి చేస్తారా?" అన్నాడు గుక్కతిప్పుకోకుండా.

లింగయ్యగారు వులిక్కిపడ్డాడు. ఈ మాటడుగుతోంది వామనుడు పరదేశయ్యే! ఏమిటే! ఈ నత్తివెధవకి తనపిల్ల కావాలీ? ఉగ్రుడైపోయాడాయన. ఆపళంగా ఆయననోట్లోంచి "అ" నుంచి "క్ష" వరకూ వున్న తిట్లుకూత లన్నీ పిడుగులవానలాగు కురిసినై. "అప్రాచ్యుడా, వెధవ, ఫుంఢాకోర్," ఇత్యాది...! పరదేశి నోరువిప్పి మాట్లాడ్లేకపోయాడు. ఏదీ? గడువు లేందే? అలాగే ఆయనకేసి చూస్తూ కూర్చున్నాడు ఆ కూసపడుతూ. చివరికి లింగయ్యగారికి చిరాకెత్తి "అలా చూస్తా వేమిటి వెధవమొహం నీవూనూ, ఫో యిక్కణ్ణుంచి" అని దుడ్డుకర్రతో వోతాపు తాచాడు. ఆ దెబ్బతో పరదేశి అక్కడినుంచి లేచిపోయాడు.

ఊరిబయట వున్న పెద్దమర్రికింద పరదేశి కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. ఏమిటి చెయ్యడం?

బాగా చీకటిపడింది. పరదేశికి ఆలోచన తెగలేదు. రాత్రి పన్నెండయివుంటుంది. చెట్టుమీది గుడ్లగూబ "గుంయ్" మని కూశింది. పరదేశి వులిక్కిపడి లేచి నిలుచున్నాడు. బుద్ధుడికి మహాబోధివృక్షము కింద దివ్యసందేశం అందినట్లు, పరదేశికి గభుక్కున మెరికెలాంటివూహ తోచింది. ఆ...అదీ సంగతి? సచారం పోయి పెళ్లాన్ని సంపాదించుకురావాలి !!

అత నేమీ వోక్షణంగూడా ఆలస్యం చేయ లేదుసుమండీ! అప్పుడే బయలుదేరాడు.

ఆ బండీలో అందరూ ఎక్కుతున్నారు. పరదేశికూడా ఎక్కాడు. ఇంజనుకూతకు వులిక్కిమన్నాడు. రైలుబండి బాగా ఖాళీగానే వుంది, సుఖంగా బెజవాడవరకూ అతను నిద్రపోయాడు. ఇంతలోకే ఎవరో మెల్లిగా తట్టి లేపారు. ఎవరో అరవై యేళ్లముసలమ్మ. ఊఁ ... అన్నాడు పరదేశి నిద్రమత్తులోనే.

"నాయనా! బెజవాడ వచ్చింది. ఇక్కడ దిగుతావా, శ్రీశైలందాకా వస్తావా? అంది" ఆవిడ.

"శ్రీశైలం" అన్నాడు పరదేశయ్య తన కామాటకి అర్థం తెలిసినట్టు. "అయితే రైలు మారాలి మరిలే" అందావిడ.

"ఊఁ. ఇంకాసేపు నిద్రపోవా" లన్నాడు. ఆవిడకి ప్రాణం విసిగి దిగిపోయింది.

"ఏయ్ ఎవ రది. టికెట్ప్లీజ్" అన్నాడు ఆ దొర. పరదేశి తెల్లపోయాడు. ఆ హాటుదగ్గిరనుంచి బూటువరకూ ఎగాదిగా తేరిపారజూశాడు. "అలా చూస్తా వేం. నీటికెట్టేదీ" అన్నాడు దొర.

"అ...అంటే" అన్నాడు అమాయకపుపరదేశి. "అంటే? అంటే? దుక్కలాగున్నావ్ రైలెక్కి తేరగా నిద్రపోవడం తెలుసుగాని టికెట్టంటే తెలియదు. స్కౌండ్రెల్ దిగు" అని దబదబబాదుతూ లాగి, ప్లాటుఫారంమీదికి నెట్టాడు. పరదేశికి ఏడుపొచ్చింది. "నే...నేను పె...పెళ్లాంకోసం వచ్చానండీ. నా...నాకు వేరేమీ తెలీదు." అని బావురుమన్నాడు.

"ఏం తెలేదు. ఏం తెలేదూ? ఎల్లా తెలుస్తుంది? నాలుగుతగిల్తే తెలుస్తుంది. పెళ్లాంకోసంవచ్చావ్ ? ఎవరు పెళ్లాం? ఈ బండీలో వుందా? అని ఇంకా బాదాడు పడుచుపసంలో వున్న ఆ టికెట్ కలెక్టరు.

ఇందాకటినుంచీ ఇదంతా చూస్తో వున్న ఓపోకు దుస్తుల కుర్రాడు "స్టాప్ప్లీజ్" అని అరిచాడు. టికెట్ కలెక్టరు నీకేం అన్నట్టు అతనికేసి చూశాడు. "అయ్యా! అతను నాకు దగ్గఱబంధువు. పెళ్లిపిచ్చతో ఇలా వొచ్చాడు. ఇంటిదగ్గఱ గోల పెడుతున్నారు. అదృష్టంకొద్దీ కనిపించాడు. ఇతని ఎక్సెస్ కూడా నేనే ఇస్తాను" అన్నాడు జేబులోంచి పర్సుతీస్తూ రామానందం.

"బావా...రా...రామానందం" అని బావురుమన్నాడు పరదేశి,

పరదేశి కనిపించకపోగానే నలుగురూ నాలుగు మూలలా బయలుదేరారు. అదీగాక రామానందం ఆనాడే కాలేజీకి వెళ్లవలసి వుండడం చేత ఆ రైలులోనే వొచ్చాడు. జాగ్రత్తగా చూసి కనిపిస్తే ఇంటికి లాక్కురమ్మని మరీ మరీ చెప్పారు దీక్షితులుగారు.

రైలు కదిలాక రామానందం మళ్లీ మొదలెట్టాడు. "ఐతే పరదేశాయ్. ఇంట్లోనుంచి పారిపోయి ఏం చేద్దామనుకున్నావ్" అన్నాడు.

"పె...ళ్లి" అన్నాడు పరదేశి అదోవిధమైన గొంతుతో. "నీబొంద. ఇదిగో చూడండీ" అని వొచమత్కారధోరణిలో పరదేశిచరిత్ర మాకు వినిపించాడు రామానందం. పెట్టెలో నవ్వని మనిషి లేడంటే నమ్మండి. చివరికి నేనే అన్నాను.

"చూడండి రామానందంగారూ! అతని దురదృష్టంకొద్దీ చాలాలోపాలున్న మాట వాస్తవం. ఈ శరీరదురవస్థకుతోడు మీ బోటివారి సూటి పోటి మాటలు వోవిధమైన మానసిక బాధ కలుగజేస్తాయి. ఇలాటి అమాయకుల్ని హింసించడం మీబోటి విద్యావంతులకు తగనిపని"

"అ—అ...అలా గడ్డిపెట్టండి అ...అ...సలు పె...పె...ళ్లిమాట యెత్తిందే వీడండి మొ...మొదట. దా...దానికితోడు మాగో...గోపయ్య మా...మయ్య గూడా నాకు బో...బోధించాడు." అని ఆ నత్తితోనే వో యిరవైనిముషాలు తన సోదంతా ఏకరువు పెట్టాడు పరదేశి. జనంగోలకు చెవులు-చిల్లులుపడ్డాయి. ఎకచెకలూ! పకపకలూ!

రామానందం సిగరెట్‌దుమ్ము దులుపుతూ, "ఆహా! వామనావతారం!" అన్నాడు అదోవిధమైన తెలివి చూపబోయ్యే కొంటె మొగంతో. అప్పటికి కడుపు నిండిందా నారదుడికి.

ఇదే ఈ వెధవలోకానికి వున్న జబ్బు! ఇలాటి అమాయకులను ఇలాటి దారుణబాధనుంచి తప్పించడానికి ప్రయత్నించే త్యాగి ఎవరూ ఈదేశంలో కనిపించలా. రైలు సాగిపోతోంది. నా ఆలోచనలో నేను మునిగిపోయాను. జనంమటుకు విరగబడుతున్నారు ఇంకా పరదేశినిగుటించే? వెధవలోకం...!!

# మొసళ్లు, దోమలు, క్వైనైను

డేంవ్ప్టీమకు "ఒలింపియా" ద్వితీయోద్యోగి విచిత్రమైన ఇద్దరు స్నేహితులను సంపాదించెను. కొన్ని నెలలక్రితము బ్రిటిషు గయానాలో రెండు మొసలిపిల్లలను పట్టుకున్నాడు. ప్రతి రాత్రి యీ రెండును ఆయన ప్రక్క క్రిందనే పడుకునేవి. మొసలిపిల్లలు నల్లగా, పసుపు నివర్ణమును గ్గివుండి పిల్లి కళ్లవంటి పసుపుపచ్చని కండ్లు కల్గివుంటాయి. వాటి దవడలలో రెండు వరుసల పదునైన పండ్లుంటాయి. అవి మొదట్లో కరపాయములైనా పెద్దవైనవెనుక ప్రాణాపాయకరములు.

ఆ డేనిష్ ఉద్యోగి స్నేహితులు ఆయనను చూచుటకు వెళ్లినప్పుడు వాటిని గూర్చి ఆయన స్నేహితులేమనేవారో సులభముగా గ్రహించవచ్చు.

మొసళ్లను ప్రక్క క్రింద పడుకోపెట్టుకునేదానికి చాలమంది భయపడవచ్చు. కాని గది మూలల్లో దాగివుండే దోమలు వాటికంటె చాల అపాయకరములనే సంగతి మనం మరచిపోతున్నాం. ఆ మొసళ్లలో ఒకటి కరవవస్తే మీరు తేలిగ్గా తప్పించుకోవచ్చు, కాని మీరు నిద్రిస్తుండగా మలేరియా దోమ మాత్రము వచ్చి కుట్టినట్లయిన జాతిసమితి, మలేరియా కమిషన్‌వారు సూచించిన విధానము అనుసరిస్తే తప్ప, ఆ కాటు చాల ప్రమాదకరము. జ్వర నిరోధకముగా రోజు 6 గ్రైనుల క్వైనైనున్నూ, జ్వరమున్నట్లయిన ౕ, 7 రోజులవరకు రోజూ 15 లేక 20 గ్రైనుల క్వైనైనున్నూ పుచ్చుకొనవలెనని ఆ కమిషనువారు సూచించినారు. ఆ కమిషనువారు తమ 1938-వ సం॥ నివేదిక 124-వ పేజిలో క్వైనెను కేవలము నిరపాయకరమైనదనియు, వైద్యసహాయము, సలహా అక్కరలేకుండానే దానిని వాడవచ్చుననియు సూచించినారు.

మలేరియా విజృంభించే టటువంటి ఆఫ్రికా తీరములో తిరిగిన ఆ డేనిష్ ఉద్యోగి తన మొసలిపిల్లలంటె యీ దోమలు వెయ్యిరెట్లు అపాయకరములని బహుశః గ్రహించే వుంటాడు.

M No 2?4